RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 63 పేజీలు - 04 వెల - 04/- బుధవారం11 డిసెంబర్ 2024

# రాజ్యసభలో ఛైర్మన్‌పై అవిశ్వాసం



**పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన**

**ఉభయసభలు నేటికి వాయిదా**

**విపక్షాల తీరుపై స్పీకర్ ఓంబిర్లా అసహనం**

న్యూఢిల్లీ,:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:
అదానీ ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు దద్దరిల్లుతోంది. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో అదానీ ముడుపుల విషయం, మణిపూర్ సంక్షోభంపై చర్చ జరగాలని ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల్లో పట్టుబడుతున్నారు. అయితే ఈ విషయాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధపడడం లేదు. దీంతో ఉభయసభలూ ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడుతున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కొద్దిసేపటికే ఉభయసభలు వాయిదాపడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన 6 నిమిషాలకే వాయిదాపడింది. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పార్లమెంటు గౌరవాన్ని కాపాడాలని అధికార, ప్రతిపక్ష ఎంపీలను కోరారు. సభలో ఎంపీలు పార్లమెంటు గౌరవాన్ని కాపాడేలా ప్రవర్తిస్తే.. ప్రజల్లోకి మంచి సందేశం వెళుతుంది అని ఆయన అన్నారు. పార్లమెంటులో విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తంచేశారు. 'మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజల ఆశలు, ఆకాంక్షలను మనం నెరవేర్చాలి.మిగతాది 2లో...

# అమరావతి పనులకు రూ. 11,467 కోట్లు

**అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఏపీ ప్రభుత్వం ఆమోదం**

**సీఆర్డీఏ పరిధిలో 20 పనులకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం**

**రూ.11,467 కోట్లతో రాజధాని నిర్మాణ పనులు**

**నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం**



అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:
రాజధాని అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఆర్డీఏ ఆమోదించిన 20 సివిల్ పనులకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాజధాని పరిధిలో చేపట్టనున్న 20 సివిల్ పనులకు రూ. 11,467 కోట్ల మేర వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో ఈ పనులు చేపట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల నివాస అపార్ట్‌మెంట్లు, ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాల నిర్మాణం పూర్తికి నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులు, మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ, రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ఈ నిధుల్ని వెచ్చించాలని నిర్ణయించింది.

మిగతా 2లో

# డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా ఏపీ..

**రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ**

అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2025 అక్టోబర్ 2 నాటికి వ్యర్థాలను సమర్ధవంతంగా నిర్వహణ చేయడం ద్వారా డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో కృషి చేస్తామని, త్వరలో కాకినాడ, నెల్లూరుల్లో, కడప, కర్నూల్, అనంతపురం దగ్గర వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, చిలకలూరిపేట శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిందాల్ ఏపి ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎంవి చారి, అధికారులతో కలిసి చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం కొండవీడు గ్రామ పంచాయితీ పరిధిలోని జిందాల్ వేస్ట్ టు



ఎనర్జీ ప్లాంట్ ని పురపాలక అండ్ పట్టణాభివృద్ధి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ%ౌ% రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, 2025లో గాంధీ జయంతి నాటికి డంపింగ్ యార్డ్ లు లేకుండా సమర్ధవంతంగా వ్యర్థాలను నిర్వహణ చేయడానికిమిగతాది 2లో...

# ఏపీ హైకోర్టులో సజ్జలకు ఊరట

**ముందస్తు బెయిల్ కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సజ్జల**

**సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దన్న ఉన్నత న్యాయస్థానం**

**గతంలో ఇచ్చిన ఆదేశాలు పొడిగింపు**



2లో

# కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూత

**సంతాపం తెలిపిన ప్రధాని , ప్రముఖులు**



బెంగళూరు ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:
కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని సదాశివనగర్‌లో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం మద్దూరులోని సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.మిగతాది 2లో...




ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక




# అమరావతి పనులకు రూ. 11,467 కోట్లు

(మొదటి పేజి తరువాయి)

అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు చేయటంతో పాటు శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం సీఆర్డీఏ రూ.1585 కోట్లు వెచ్చించనుంది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో భాగంగా 12 టవర్లుతో 1200 అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం రూ.984 కోట్లు కేటాయించింది. రాజధాని పరిధిలో వరద నీటి కాలువలు, డ్రెయిన్లు, నీటి సరఫరా నెట్‌వర్క్, సీవరేజీ, యుటిలిటీ డక్టులు, పాదచారుల బాట, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

# ఏపీకి త్వరలో కొత్త డీజీపీ..!




ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 10: కొత్త ఏడాదిలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త డీజీపీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమల రావు ఏడాది చివరిలో రిటైర్ కానున్నారు. ఆయన పదవికాలం పొడిగించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకూ చీఫ్ సెక్రటరీ పదవీ కాలం పొడిగించేవారు కానీ డీజీపీ పదవి కాలాన్ని పొడిగించిన సందర్భాలు లేవు. ద్వారకా తిరుమలరావు పదవి కాలం పొడిగింపునకు చంద్రబాబు ప్రయత్నం చేస్తారా మరొకరికి చాన్సిస్తారా అన్నది త్వరలో తెలియనుంది. ఇప్పటికే ఆయన రిటైర్మెంట్ డేట్ పై సీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎస్ అధికారుల్లో అత్యంత సీనియర్ ద్వారకా తిరుమలరావు, ఎన్నికల సంఘం ఎన్నికల సమయంలో రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా తప్పించింది.నిజానికి ఆయన సీనియార్టీలో టాప్ టెన్ లో లేరు.కానీ జగన్ రెడ్డి మనోజ్ అనుకుని ఆయనకు అందలం ఎక్కించారు. ఎన్నికల సమయంలో ఈసీ ఆయనను తప్పించి సీనియర్టీలో మొదటిస్థానంలో ఉన్న ద్వారకా తిరుమలరావును కూడా కాదని హరీష్ కుమార్ గుప్తాకు చాన్సిచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన తరవాత కొన్నాళ్లు గుప్తానే డీజీపీగానే ఉన్నారు కానీ తర్వాత ద్వారకా తిరుమలరావుకు చాన్సిచ్చారు.

చంద్రబాబు డీజీపీ విషయంలో నిబంధనల ప్రకారం వెళ్తారు. సీనియార్టీకి గౌరవం ఇస్తారు. అదేసమయంలో సమర్తత చూస్తారు. సీనియార్టీ ఉన్నా.. అంచనాలకు అనుగుణంగా పని చేస్తారని అనుకోకపోతే పదవి ఇవ్వరు. ద్వారకా తిరుమలరావు తర్వాత మళ్లీ హరీష్ గుప్తాకే చాన్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎవరు డీజీపీగా ఉన్నా.. వైసీపీ హాయాంలో సవాంగ్, రాజేంద్రనాథ్ రెడ్డి తరహాలో విచ్చలవిడిగా వ్యవహరించే అవకాశం మాత్రం ఉండదని గుర్తు చేస్తున్నారు.

# ఏపీ హైకోర్టులో సజ్జలకు ఊరట

**ముందస్తు బెయిల్ కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సజ్జల**

**సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దన్న ఉన్నత న్యాయస్థానం**

**గతంలో ఇచ్చిన ఆదేశాలు పొడిగింపు**



అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10: టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అగ్రనేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. సజ్జల రామకృష్ణారెడ్డిపై మరో రెండు వారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ కేసులో సజ్జల ముందస్తు బెయిల్ కోరుతూ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను వేధిస్తున్నారని సజ్జల ఆరోపించారు. ముఖ్యంగా, తనపై 41ఏ నోటీసులకు అవకాశం లేని సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. అందుకే తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని సజ్జల కోర్టును కోరారు. ఈ పిటిషన్ పై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు... గతంలో ఇచ్చిన ఆదేశాలను మరో రెండు వారాలు పొడిగించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూత

(మొదటి పేజి తరువాయి)

ఎస్ఎం కృష్ణ మృతి నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. పూర్తి అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'కృష్ణ ఒక అద్భుమైన నేత. అన్ని వర్గాల ప్రజల నుంచి అభిమానాన్ని అందుకున్నారు. తన జీవితాంతం ఇతరుల కోసం పాటు పడ్డారు. కర్ణాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పనపై ఆయన ఎక్కువ దృష్టి సారించారు. ఎస్ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారు' అని ఎక్స్? వేదికగా తెలిపారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు నేతలు ఎస్?ఎం కృష్ణ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైసూర్‌లోని మహారాజా కళాశాలలో ఎస్ఎం కృష్ణ పట్టభద్రుడయ్యారు. బెంగళూరులోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో చదివారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో గుర్తింపు పొందారాయన. 1971- 2014 వరకు, అతను వివిధ సమయాల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. డిసెంబర్ 1989 నుండి జనవరి 1993 వరకు కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు. ఆ తర్వాత ఎస్ఎం కృష్ణ 1999- 2004 వరకు కర్ణాటక 16వ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆయన హయాంలో ఐటీ ఇండస్ట్రీలో అభివృద్ధిలోకి వచ్చింది. ఆ తర్వాత 2004-2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా, కేంద్ర విదేశాంగ మంత్రిగా పని చేసిన అనుభవం ఆయన సొంతం. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రావడం, కర్ణాటకలో మారిన పరిస్థితుల నేపథ్యంలో 2017 మార్చిలో బీజేపీలో చేరారు. చివరిసారిగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో చేరినప్పుడు బహిరంగంగా ప్రచారం చేశారు. ఆ తర్వాత ఆయన క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు. కర్ణాటక అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అన్నీఇన్నీ కావు.

# రాజ్యసభలో ఛైర్మన్‌పై అవిశ్వాసం

మనమందరం సభా గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, గత కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనలు బాగుండటం లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఇరు సభలు రేపటికి వాయిదా పడ్డాయి. మరోవైపు సభ వాయిదా అనంతరం అదానీ వ్యవహారంపై కేందప్రభుత్వం సమాధానం ఇవ్వాలని పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తూ నిరసన చేశారు. సభలు వాయిదాల పర్వం నేపథ్యంలో పార్లమెంటు సజావుగా నడపకూడదని ప్రభుత్వం నిర్ణయించుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ విమర్శించారు. కాగా, మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. సభలో గందరగోళం నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభ పారంభమైనా మధ్యాహ్నం 1 గంటకు మరోసారి వాయిదాపడింది. ఇకపోతే పార్లమెంటులో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభకు ఛైర్మన్‌గా ఉన్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈక్రమంలో ఆయన పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్షేపించింది. ఈ అవిశ్వాస తీర్మాణానికి తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌తో సహా ఇండియా కూటమి నేతలు మద్దతిచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు 50 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంటుంది. అయితే, 70 మంది ఎంపీలు తమకు మద్దతుగా సంతకాలు చేశారని కాంగ్రెస్ నాయకురాలు రణజీత్ రంజన్ ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు.

# ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ షురూ..

## ఏఐ, డీప్ టెక్‌లతో పౌర సేవలు నిర్వహణ




అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10: అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఆ కోవకే చెందిన వార్త ఇది. ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వాట్సాప్ ద్వారా పౌర సేవలు వేగంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మనం ప్రతీ సమాచారాన్ని పొందడానికి, చేరవేయడానికి వాట్సాప్‌ను ఎలా వినియోగిస్తున్నామో, ఇక ప్రభుత్వం కూడా మనకు అవసరమైన సేవలు వాట్సాప్‌లో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఇకపై వచ్చేదంతా వాట్సప్ గవర్నెన్స్ అంటూ తాజాగా ప్రకటించింది కూడా. పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం అవసరమని, విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఆ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎస్‌కు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం.సమర్ధవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కూడా బాధ్యతలు ఫిక్స్ చేసారు. మొదటగా ప్రతిశాఖలో సమాచార సేకరణ జరగాలని, తర్వాత ఆ సమాచారాన్ని సమీకృతం చేసుకోవాలని.. అంతిమంగా 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. మంగళవారం సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయి కూడా ఆర్టీజీఎస్ పరిశీలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డ్రోన్లు, సీసీ కెమేరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైజ్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధృవీకరించుకోవడం జరిగిందని.. అలాగే రానున్న రోజుల్లో పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే రాష్ట్రంలోని రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్ల ద్వారా ప్రమాద స్థలాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగ్గ ధర, 48 గంటల్లో డబ్బులు జమ చేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు తమ సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సంతృప్తి స్థాయి తెలుసుకోవడం ద్వారా మరింత మెరుగ్గా సేవలు అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే..ఎందుకు వ్యక్తమవుతోందనే దానిని పరిశీలించి తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా? లేదా? అనేది సరిచూసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఆధార్ సంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు సంబంధించిన రూ.20 కోట్ల నిధుల మంజూరుకు సీఎం అనుమతిచ్చారు. వీలైనంగా త్వరగా గ్రామ %-% వార్డు సచివాలయాల్లో వెయ్యి ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలని చెప్పారు. ష్టంలో జనన %-% మరణ ధృవపత్రాలు పొందేందుకు తలెత్తుతున్న ఇబ్బందులను శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పంచాయతీ రాజ్ %-% పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్ కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు.

# డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా ఏపీ..

(మొదటి పేజి తరువాయి)

ప్రత్యేక ప్రణాలికలు సిద్దం చేస్తున్నామన్నారు. ప్రజల మీద గత ప్రభుత్వం విధించిన చెత్త పన్నుని చట్టపరంగా రద్దు చేసి, చెత్తని సమర్దవంతంగా నిర్వహణ చేయడం ద్వారా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2014-19 మధ్యలో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో స్టడీ చేసి, ఉత్తమ విధానాలతో ఆంధ్రప్రదేశ్ లో 10ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందని, అందులో భాగంగా గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు స్థల సేకరణ జరగడం, ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు.తదుపరి ప్రభుత్వం మారిన తర్వాత చెత్త మీద పన్నులు విధించి ప్రజలపై భారాలు వేయడంపై చూపిన శ్రద్ధ చెత్త నిర్వహణపై చూపకపోవడం, చెత్త నిర్వహణకు దోహదం చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ల నిర్మాణంపై దృష్టి సారించకపోవడం వలన రాష్ట్రంలో సుమారు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే గత ప్రభుత్వం పోగుచేసిన లెగసి వ్యర్థాలను క్లియర్ చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజు సుమారు 6890 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి జరిగితే, అందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో, విశాఖపట్నంలో జిందాల్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్లాంట్ ల్లో 2160 టన్నుల వ్యర్థాలను (31 శాతం) ట్రీట్ మెంట్ చేస్తున్నారన్నారు. ప్లాంట్ల పరిధిలోని 50 నుండి 60 కిలోమీటర్ల పరిధిలోని కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయితీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు.

## పవన్ కు బెదిరింపు కాల్స్ నిందితుడు అరెస్ట్



విజయవాడ ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీకి ఫోన్ చేసి చంపేస్తామంటూ బెదిరింపు కాల్స్, మెసేజ్ లు చేసిన నిందితుడిని అరెస్టు చేశారు పోలీసులు. గతంలో అతను హోంమంత్రి అనితను కూడా బెదిరించినట్లు గుర్తించారు. నిందితుడు విజయవాడకి చెందిన నూక మల్లిఖార్జున్ గా పోలీసులు గుర్తించి అతడిని పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. చివరకు అతడిని ఇవాళ ఉదయం విజయవాడలోనే పట్టుకున్నారు. దీంతో అతన్ని స్థానిక పీఎస్ కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. పవన్ కళ్యాణ్ పేషీ నంబర్లు ఎలా దొరికాయి, ఫోన్ చేసి ఏమేం మాట్లాడాడన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు.

కాగా, నూక మల్లిఖార్జున మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ఇలా బెదిరింపు కాల్స్ చేసినట్లు నిర్ధారించారు. గతంలో ఇలా ఎవరెవరిని బెదిరించాడన్న దానిపై నూక మల్లిఖార్జునను పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో భాగంగా గతంలో వైజాగ్ లో నూక మల్లిఖార్జునపై 354 కేసు నమోదు అయినట్లు గుర్తించారు. దీంతో ఇంకా ఏయే పోలీసు స్టేషన్లలో అతనిపై కేసులున్నాయన్న దానిపై ఆరా తీస్తున్నారు.

# కొత్త బస్సుల కొనుగోలుకు ఆర్టీసీ ప్రతిపాదనలు

**ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం**

**వివరాలు వెల్లడించిన టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ**


**ఆటో డ్రైవర్లు నష్టపోకుండా విధివిధానాల రూపకల్పన**




అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పథకం అమలుపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట రావు ట్విట్టర్ లో కీలక ప్రకటన చేశారు. వచ్చే సంక్రాంతి నుంచే ఫ్రీ జర్నీ అమలు చేస్తామని, దీనికోసం ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోందని ట్వీట్ చేశారు.పథకం అమలు వల్ల బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉండడంతో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించిందని చెప్పారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించారని, సీఎం వాటిని పరిశీలిస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా ఆటో డ్రైవర్లు నష్టపోకూడదని ప్రభుత్వం భావిస్తోందని, దీనికి అనుగుణంగా పథకం విధివిధానాలు రూపొందిస్తున్నామని యార్లగడ్డ పేర్కొన్నారు.

# నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం.!

## -జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్.
































ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 10: జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా సర్వతోముఖఅభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక %ం% వాణిజ్య పన్నులు మరియు మంత్రివర్యులు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన జిల్లా మంత్రులు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనములు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి లతో కలిసి సుదీర్ఘ జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, ఎమ్మెల్సీ రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా అఖిలప్రియ, గిత్త జయసూర్య, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మన బాధ్యతలను గుర్తించుకొని జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లోటు బడ్జెట్ లో ఉందని గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో జిల్లాను అభివృద్ధి చేసేందుకు సమిష్టి కృషి చేయాలని మంత్రి తెలిపారు. సరైన సమయంలో రాష్ట్ర ప్రజలు సరైన నాయకున్ని ఎన్నుకొని కూటమి ప్రభుత్వానికి అధికారాన్ని ఇచ్చారన్నారు. లేనిపక్షంలో వెండి లెటర్ పై ఉన్న రాష్ట్రం అధఃపాతాళానికి వెళ్లిపోయే ప్రమాదం జరిగేదన్నారు. దాదాపు లక్ష 32 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అందుబాటులో ఉన్న వనరులతోనే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రివర్గం శక్తికి మించి పనిచేస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకు తగ్గట్టుగా అధికారులందరూ సహకరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆగిపోయిన 73 పథకాలను ఆరు వేల కోట్ల రూపాయలతో పునరుద్ధరించామన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రజావసరలకు ఉపయోగపడే పనులు చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని పరుగుపెట్టే దిశలో కమిట్మెంట్తో పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి పనిచేయాలని మంత్రి సూచించారు. జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంటలకు కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వమే ఏర్పాటు చేసి మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయడంతో పాటు 48 గంటలలో రైతులకు సంబంధిత మొత్తాలను అందజేస్తామన్నారు. రైస్ మిల్లు ట్రేడర్లతో సమావేశం నిర్వహించి రైతుకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ చేసే రైతులకు సంబంధిత కంపెనీల ప్రతినిధులను పిలిపించి ఆయిల్ ఫామ్స్ సాగు దిగుబడి లాభాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. శాసన సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను ప్రత్యేక లేడ్జర్ బుక్ లో నమోదు చేసుకొని సాధ్యాసాధ్యాలపై శాసనసభ్యులకు తిరిగి వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, జవాబుదారీ తనంతో పని చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన అర్జీలను ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తూ 65 వేల ఎకరాలలో ఉన్న ఫ్రీ హెూల్డ్ భూములపై ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. ఆళ్లగడ్డ నంద్యాల, పట్టణాల్లో కేసి కెనాల్ ఆధీనంలో ఉన్న భూముల ఆక్రమణపై కమిటీ ఏర్పాటు చేసి పూర్తీ స్థాయిలో వివరించాలన్నారు.

రాష్ట్ర రోడ్లు భవనములు, మౌలిక సదుపాయాలు పెట్టబడులు శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి కుంటుపడిందని సంక్షేమము అభివృద్ధి సమానంగా తీసుకొని సమాన స్థాయిలో తీసుకొని పరుగులు పెట్టిస్తున్న నేపథ్యంలో అధికారులందరూ సహకరించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తే ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు. జాతీయా రహదారులు, రైల్వే, సాగు నీటి ప్రాజెక్ట్ లకు అవసరమైన భూసేకరణకు ఫారెస్ట్ అధికారులు సహకరించాలన్నారు. శాసనసభ్యులు సూచించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రాధాన్యత క్రమంలో పనులు చేయాలని సూచించారు. రానున్న వేసవి నీ దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సిసి రోడ్లు, గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేసి 50 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు.

రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సమావేశంలో శాసనసభ్యులు సూచించిన సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విషయాలు క్షుణ్ణంగా చర్చించామని ప్రభుత్వం పని చేస్తుందన్న నమ్మకంతో ప్రజలు ఉన్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చెప్పట్టిన పనులను పూర్తి చేయాలన్నారు. రాబోయే ఒకటి,రెండు సంవత్సరాలు ఇబ్బందికరంగా వుతుందని వున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్ళలన్నారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులకు కూడా వన్ బి రికార్డులు తీసుకొని పంటరనాల మంజూరు చేయాలని అన్ని బ్యాంకర్లకు ఆదేశాలు ఇచ్చామని మంత్రికి వివరించారు. ఉపాధి హామీ పథకం క్రింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులను అన్ని మండలాలకు సమాన స్థాయిలో విభజించి రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

డోన్ శాసన సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో తాగు నీటి నివారణకు గోరుకల్లు రిజ్వాయర్ నుండి చేపట్టిన తాగు నీటి పైప్ లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తిచేయాలని మంత్రిని కోరారు.

ఆత్మకూరు శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు.

ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ప్రకృతి, ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న సమగ్ర రక్షిత నీటి పథకాన్ని పూర్తిచేసి 20 గ్రామాలకు నీరు అందించాలని మంత్రిని కోరారు. పాణ్యం శాసనసభ్యులు గౌరవ చరితారెడ్డి మాట్లాడుతూ గడివేముల మండలంలో పంట నష్టపోయిన సోయాబీన్ రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

# ఆశల వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలి



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 10: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆశల వేతనాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని సమస్యలన్నీ పరిష్కరిస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం దగ్గర ధర్నాకు ర్యాలీగా వెళ్లి జిల్లా ఇన్చార్జి మంత్రి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు ఆశ వర్కర్లు తమ సమస్యలు విన్నవించడానికి పోతుంటే పోలీసులు అడ్డుకొని నాయకులకు పోలీసులకు జరిగినది ర్యాలీని స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ దగ్గర ఆపి అక్కడ ధర్నా నిర్వహించడం జరిగినది ధర్నా అనంతరం అడిషనల్ డీఎంహెచ్ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది ఈ ధర్నా ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగినది ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా ప్రధాన కార్యదర్శి సుంకయ్య గారు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్ పాల్గొన్నారు నాయకులు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా గర్భవతులకు బాలింతలకు నవజాత శిశువులకు సేవలందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను ఆరోగ్య సూత్రాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో కి సర్వేల రూపంలో తీసుకెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక భూమిని పోషిస్తున్న ఆశా కార్యకర్తల పైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు .పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు రాజకీయ వేధింపులు ఆపాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని, పెన్షన్ 10000 ఇవ్వాలని, పది లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని, సాధారణ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నిటి సెలవులు ఇవ్వాలని, రికార్డులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఆశలకు సంబంధం లేని రక్త పరీక్ష ,గళ్ళ పరీక్ష, గళ్ళ సేకరణ, క్లినిక్ లో శుభ్రం చేసే పని అనేక రకాల పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేసి వినతి పత్రం ఇచ్చినప్పటికీ వినతి పత్రంలోని సమస్యల గురించి ఇప్పటివరకు ఏ విధమైన స్పష్టత ఇవ్వలేదని త్వరలోనే ఆ సమస్యలపై స్పష్టత ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉదృతం చేస్తామని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు భూమిని శ్రీనివాస్ అబ్రహం లక్ష్మీదేవి ప్రమీల సుధాలక్ష్మి అరుణ జిల్లాలోని ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర విభజనను పార్లమెంట్లో తలుపులు మూసేసి చేశారు

**ఏపీకి జరిగిన అన్యాయంపై తాను పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నా**

**ఎన్డీఏలో కీలకంగా ఉన్నందున పవన్ ఆ బాధ్యత తీసుకోవాలి**

**పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి లేఖ**

అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను పార్లమెంట్‌లో తలుపులు మూసేసి చేశారన్న ఉండవల్లి అరుణ్ కుమార్.. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై తాను పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నానని చెప్పారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో తాను పిటిషన్ వేస్తే.. కేంద్రం ఇన్నేళ్లయినా కౌంటర్ దాఖలు చేయలేదని చెప్పారు. అలాగే ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్నందున పవన్ కళ్యాణ్ ఆ బాధ్యత తీసుకోవాలని.. రాష్ట్రం నుంచి కూడా అఫిడవిట్ దాఖలు చేయాలని ఉండవల్లి సూచించారు.ఈ విషయంలో తాను సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. అలాగే కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ. 74542 కోట్లు బకాయిలు రావాలని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తేల్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత 2018లో అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు కలిసి ఈ విషయమై చర్చించానని.. దీనిపై లోక్ సభలో చర్చించేందుకు నోటీసు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు. కానీ అవి ఇప్పటికీ అమలు కాలేదని ఉండవల్లి విమర్శించారు. 2019లో విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మనకు జరిగిన అన్యాయంమై పార్లమెంటులో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని తీర్మానించామని.. కానీ నాటి ఎన్నికల్లో వైసీపీ గెలిచిందని ఉండవల్లి అరుణ్ కుమార్ లేఖలో పేర్కొన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టులో రాష్ట్రం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని.. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా తాను లేఖ రాశానని కానీ తనకు ఎలాంటి సమాధానం రాలేదని ఉండవల్లి పేర్కొన్నారు. అయితే 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి .. తాను వేసిన పిటిషన్‌పై విచారణను మూసివేయాలని కోరినట్లు ఉండవల్లి గుర్తుచేశారు. 2014 ఫిబ్రవరిలో పార్లమెంటులో జరిగిన ఘటనలపై, ఏపీకి జరిగిన అన్యాయంపై టీడీపీ, వైసీపీ సభ్యులు చర్చకు నోటీసులు ఇవ్వడం లేదన్న ఉండవల్లి.. ఎక్కడైతే మన నోరు నొక్కి సభా నిబంధనలను తుంగలో తొక్కి భారత రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించారో... అక్కడే మనకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాలని కోరారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయే కూటమిలో ఉండటంతో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇదే సరైన సమయమని ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని, పార్లమెంటు ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరు, ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చకు నోటీసు లిప్పించాలనీ, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఉండవల్లి అరుణ్ కుమార్ పవన్ కళ్యాణ్‌ను కోరారు.

# రాజ్యసభ కూటమి అభ్యర్ధుల నామినేషన్స్

**పోటీకి వైసిపి దూరం**

**ఏకగ్రీవంగా ఎన్నికయ్యే ఛాన్స్**

**నామినేషన్స్ పత్రాల పరిశీలన అనంతరం ప్రకటన**

అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10: రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులుగా టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీశ్, బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యలు నేడు తమ నామినేషన్ లు దాఖలు చేశారు.. ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ల ను బలపరుస్తూ, 10 మంది చొప్పున కూటమి ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు.వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానుంది. కాగా, నామినేషన్ల అనంతరం అభ్యర్థులు మాట్లాడుతూ, కూటమి ఆశయాలకు అనుగుణంగా తమ గళాన్ని పెద్దల సభలో వినిపిస్తామన్నారు..

%చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేస్తానని తెలిపారు బిజెపి అభ్యర్థి కృష్ణయ్య. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పిలిచి తనకు రాజ్యసభ టికెట్ ఇచ్చిందని అన్నారు. సీఎం చంద్రబాబు తనను రాజకీయాల్లోకి పిలిచారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని చెప్పారు..50 ఏళ్లు బీసీల కోసం పోరాటం చేశానని చెప్పారు. వైసీపీకి పార్టీలో మాట్లాడే అవకాశం తక్కువ అని.. బీసీల గురించి ఎక్కువగా మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీ మారానని తెలిపారు. బీజేపీ తనకు కొత్త కాదని, తాను కండువా కప్పుకున్న మొదటి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. పార్టీల కండువాలు వేసుకోలేదు. అన్ని పార్టీలు బీసీల కోసం న్యాయం చేస్తున్నాయని చెప్పారు. పార్టీలే తన దగ్గరకు వచ్చాయని బీజేపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థి బీదా మస్తాన్ రావు తెలిపారు. అనివార్య కారణాల వల్ల రెండున్నరేళ్లు తెలుగుదేశానికి దూరమయ్యానని అన్నారు. సొంతిల్లు లాంటి తెలుగుదేశంలో కొంతకాలం లేకపోవడం ఎంతో బాధించిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు కీలక పదవులు ఆపార్టీలో దక్కుతున్నాయని బీదా మస్తాన్ రావు తెలిపారు.

## ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ పై చర్యలు తీసుకోవాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 10:
బక్క ప్రాణులపై ప్రతాపం చూపిస్తున్న ట్రాఫిక్ సిఐ గారికి సీఎంఆర్ షాపింగ్ మాల్ వల్ల ఏర్పడే ట్రాఫిక్ అంతరాయం కనపడలేదా? ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ను ట్రాఫిక్కు అంతరాయం లేని ప్రాంతానికి తరలించాలి. సంబంధిత అధికారులను డిమాండ్ చేసిన సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ఈ సందర్భంగా మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్కు కూతవేటు దూరంలో గత మూడు రోజుల కిందట ప్రారంభం చేసినటువంటి సీఎంఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం పార్కింగ్ స్థలం లేకుండా మాల్ను ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుందనివారన్నారు. షాపింగ్ మాల్ కు సంబంధించినటువంటి జనరేటర్ ను రోడ్ మీదకు ఏర్పాటు చేయడం కూడా జరిగిందని తెలిపారు.అంతేకాకుండా సీఎంఆర్ షాపింగ్ మాల్ ఇంకా చాలా రకాల ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ మాల్ నిర్వహణ చేస్తున్నారని, ఏ విధంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ కు అనుమతులు ఇచ్చారని తెలియజేయాలని సంబంధిత అధికారులను వారు డిమాండ్ చేశారు. సంబంధించిన అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని అన్నారు.


## జర్నలిస్ట్ ల సమస్యలను పరిష్కరించాలి..!

**-రాష్ట్ర ఆర్థికశాఖ, నంద్యాల జిల్లా ఇన్చార్జి పయ్యావుల కేశవ్ కు ఎపియుడబ్లుజె వినతిపత్రం.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 10:జర్నలిస్ట్ ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థికశాఖ, నంద్యాల జిల్లా ఇన్చార్జి పయ్యావుల కేశవ్ కు ఎపియుడబ్లుజె నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాలకు విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను ఎపియుడబ్లుజె రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యాం సుందర్ లాల్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు బాబు, ఉస్మాన్ భాష, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబులు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న జర్నలిస్ట్ లకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, ప్రెస్ క్లబ్ కోసం ఏపీయూడబ్ల్యూజే యూనియన్ కు స్థలాన్ని కేటాయించాలని, జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ కల్పించాలని, జర్నలిస్టుల మీద దాడులకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. అనంతరం మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి,ఎన్ఎండి ఫరూక్ లు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## బలహీన వర్గాలకు టీడీపీలోనే ప్రాధాన్యం..: మంత్రి కొలుసు



అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:
బలహీన వర్గాల వారికి చట్టసభల్లో సముచితమైన స్థానం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, రాజ్యసభకు జరుగుతున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రెండు స్థానాలు బలహీనవర్గాల వారికి కేటాయించి రాజకీయంగా సముచిత స్థానం కల్పించిందని రాష్ట్ర గృహ నిర్మాణ అండ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం కూటమి సభ్యుల నామినేషన్ కార్యక్రమానికి హాజరైన మంత్రి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. బలహీన వర్గాల వారికి రాజకీయంగా గుర్తింపు తీసుకురావడమే గాక దేశంలో ఎక్కడా లేనివిధంగా పార్టీ అధ్యక్ష పదవిని ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తికి కేటాయించడం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు.గతంలో బలహీనవర్గాలని బ్యాక్ బోన్ గా ప్రచారం చేసుకున్న పార్టీలు వారికి చట్టసభల్లో కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, బలహీనవర్గాల వారిని వాడుకోవడానికి గత ప్రభుత్వాలు చేశాయని మంత్రి విమర్శించారు. ఒక రాజకీయ పార్టీకి జీవితకాలం అధ్యక్షుడిగా ఉండాలని గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పార్టీలో తీర్మానం చేయించుకున్నారని, ఆ తీర్మానాన్ని ఎన్నికల సంఘం అనుమతించలేదని, కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం బలహీన వర్గాల వారికి అధిక ప్రాధాన్యమిస్తూ పార్టీ పరంగా, ప్రభుత్వపరంగా అధిక ప్రాధాన్యతను ఇచ్చిందని మంత్రి వివరించారు.గత ప్రభుత్వంలో కేబినెట్ లో ఉన్న మంత్రులు ఏ విధమైన చర్చల్లో పాల్గొనేవారు కాదని, కానీ ప్రస్తుతం ప్రభుత్వంలో బలహీన వర్గాలకు చెందిన మంత్రులు కేబినెట్ సమావేశాల్లో ఏ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా దాని గురించి వివరంగా చర్చిస్తున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక విషయంలో సముచిత న్యాయం పాటించారని మంత్రి వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పడిన పరిస్థితుల వల్ల గతంలో రాష్ట్రం నుంచి వెళ్ళిపోయిన పారిశ్రామిక వేత్తలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నారని మంత్రి పార్థసారధి వివరించారు.

## వచ్చే వారం సీఎం పోలవరం పర్యటన..

అమరావతి:ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 10:రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే వారం పోలవరంలో పర్యటించనున్నట్టు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో పాటు ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశమై సీఎం పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.పోలవరం పర్యటన సందర్భంగా సీఎం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి –టైం షెడ్యూల్ ను కూడా విడుదల చేయనున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. జనవరి నుంచి డయా ఫ్రం వాల్ పనులు ప్రారంభం కానున్నాయి. డయాఫ్రం వాల్ నిర్మాణంతో పాటు సమాంతరంగా ఎర్త్ కం రాక్ ఫిల్లింగ్ (ఈసీఆర్ఎఫ్) పనులు కూడా చేపట్టాల్సి ఉంది. త్వరలోనే సహాయ, పునరావాసం (ఆర్అండ్ఆర్)తో పాటు భూసేకరణ పనులు కూడా పున:ప్రారంభించి వేగవంతం చేయాలి. షెడ్యూల్ ప్రకారం ఒక్క గంట కూడా వృధా కాకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నిమ్మల దిశా నిర్దేశం చేశారు.

# 4 వ జాబ్ మేళా ను ప్రారంభించిన

## నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 10:
గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు.
ఈ సందర్భంగా స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆడిటోరియం బొమ్మల సత్రం నందు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన , స్కిల్ హబ్ కోఆర్డినేటర్ షేక్ మస్తాన్ వలి , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ శశికళ , 36 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి



ఫిరోజ్ పాల్గొని జాబ్ మేళాను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు . 2 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయని దాదాపు 80 కి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు . ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## రబీ సీజన్లో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోండి.!

**-నంద్యాల జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్. -న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 10:
రబీ సీజన్ లో సాగునీటి కాలువల కింద ఉన్న రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని జిల్లా ఇన్చార్జి మరియు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పనుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా అభివృద్ధి సమావేశం అనంతరం జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, ఎమ్మెల్సీ రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా అఖిలప్రియ, గిత్త జయసూర్య,జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సాగునీటి కాలువల కింద రబీ సీజన్లో ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని రైతులకు సూచించారు. తెలుగు గంగ కింద 84 వేల ఎకరాలు,





ఎస్సార్ బీసీ కింద లక్ష ఎకరాలు, కేసి కెనాల్ కింద 90 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు వారబంధీ పద్ధతిలో మార్చి 31 వరకు సాగునీటిని ఇచ్చేందుకు నీటిని విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. శ్రీశైలం జలాశయంలో కేవలం 27 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉందని నీటి లభ్యతను బట్టి వరి పంటకు నీటిని విడుదల చేసే వివరాలను వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. అలగనూరు బ్యాలెన్స్ రిజర్వాయర్ మరమ్మత్తులకు మూడు కోట్ల ప్రతిపాదనలు గత ప్రభుత్వం విస్మరించి ప్రస్తుతం 34 కోట్లకు చేరిందన్నారు. వంద సంవత్సరాలు చరిత్ర ఉన్న కేసి కెనాల్ మరమ్మతులను నిర్లక్ష్యం చేశారన్నారు. గోరుకొల్లు రిజర్వాయర్ కుంగినప్పటికీ ఎలాంటి మరమత్తులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ కెసి కెనాలకు సంబంధించి స్థిరీకరించిన ఆయకట్టుకు నీటిని సరఫరా చేయాలంటే గుండ్రేవుల ప్రాజెక్టు శాశ్వత పరిష్కారం అన్నారు. ఎమ్మెల్యేలు అందరూ మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తే కేసీ కెనాల్ కు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.

## ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన

## ఇందులో ఎలాంటి కుట్ర కోణం లేదు.!

**-నంద్యాల జిల్లా ఎస్పీ అభిజిత్ సింగ్ రాణా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 10:
09-12-2024 వ తేది సోమవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతం లో నందికొట్కూర్ టౌన్ లోని బైరెడ్డి నగర్ లోని బిరికెల మాధవయ్య సన్నాఫ్ లాలయ్య ఇంటి బయట ఉన్న రూమ్ లో అతని మనుమరాలు అయిన మృతురాలు యొక్క స్వగ్రామం రామల్లకోట, వెల్దుర్తి మండలం గత రెండు సంవత్సరాల నుండి మృతురాలు నందికొట్కూర్ లోని తన తాత ఇంటిలో ఉంటూ ఇంటర్ రెండవ సంవత్సరం నంది జూనియర్ కాలేజీ లో చదువుతూ ఉండి గత 3 సంవత్సరాల క్రితం ఆమె 10 వ తరగతి చదువుచున్నప్పటి నుండి వెల్దుర్తి మండలం కలుగోట్ల కు చెందిన బోయ ఆకుల రాఘవేంద్ర తో చనువుగా ఉంటూ అతన్ని ప్రేమిస్తూ ఇష్ట పూర్వకంగా వారిద్దరూ నందికొట్కూర్ లో తన తాత ఇంట్లో బయట ఉన్న స్టోర్ రూమ్ లో గత సంవత్సరం నుండి అప్పుడప్పుడు వ్యక్తిగతంగా ఇష్ట పూర్వకంగా ఒకరినొకరు కలుస్తూ అన్యోన్యంగా ఉండేవారు. అతను రాత్రి వచ్చి ఉదయం




తెల్లవారుజామున వెళ్లిపోయేవాడు. అదే విధంగా 08-12-2024 వ తేది రాత్రి సుమారు 11 గంటల సమయం లో రాఘవేంద్ర నందికొట్కూర్ లోని బైరెడ్డి నగర్ లో ఉన్న లహరి తాత ఇంటికి వచ్చి ఇద్దరు కలిసి ఉండి రాత్రి దోమలకు జెట్ కాయిల్ అంటించుకొని నిద్రిస్తూ ఉండగా స్టోర్ రూమ్ లో అక్కడే ఉన్న పెయింటింగ్ లో వాడే మిగిలిన టిన్నర్ మూత లేకుండా ఉండి వారు నిద్రిస్తున్న సమయం లో దుప్పటి ప్రమాదవశాత్తు టిన్నర్ కు తగిలినందున టిన్నర్ కిందపడి టిన్నర్ బండల మీద పడి అది మండుచున్న జెట్ కాయిల్ కు తగిలి అది మండే స్వభావం కలిగినందున అకస్మాత్తుగా మంటలు చెలరేగి నిద్రిస్తున్న వారు గమనించక పోవడం తో వారు పండుకున్న ఇనుప ప్లాస్టిక్ వైరు కు అంటుకోవడం తో మంటలు మృతురాలికి మరియు రాఘవేంద్ర కు అంటుకొని వారు లోపల గడియ వేసుకొని పండుకొన్నందున బయటికి రాలేక మృతురాలు అక్కడి కక్కడే శరీరమంతా కాలి చనిపోయినది. చీకటిగా పొగ ఉండడం తో వారు బయటకు రాలేక మృతురాలు అక్కడికక్కడే చనిపోయినది. రాఘవేంద్ర కాలిన గాయాలతో బయట పడి ప్రస్తుతం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడు. దర్యాప్తు ప్రకారం వారిద్దరి మధ్య ఎలాంటి మనస్పర్ధలు లేవు. ఈ కేసులో అన్ని రకాల రిపోర్ట్స్ పెండింగ్ లో ఉన్నందున తదుపరి వాటిని తీసుకొన్న తరువాత కేసులో తదుపరి చర్య ఉంటుంది. ఇప్పటి వరకు వచ్చిన సాక్ష్యాధారాలను బట్టి ఇది కేవలం ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన. వీటిలో ఎవ్వరి ప్రమేయం గాని, కుట్ర గాని లేదు. ఈ కేసు విచారణ నిమిత్తం ఆత్మకూరు డి.ఎస్.పి అధర్వంలో అన్నీ కోణాలలో విచారణ నిమిత్తం సబ్ డివిజన్ లోని ముగ్గురు సిఐ లు మరియు 6 గురు ఎస్సై లు దర్యాప్తులో పాల్గొన్నారు.

## మండలంలోని రెవిన్యూ సదస్సులకు స్పందన కరువు...!

**-మధ్యాహ్నానికే వెళ్లిపోతున్న రెవెన్యూ అధికారులు. -రెవిన్యూ శాఖపై ప్రజల్లో నమ్మకం లేదా.?**

ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూర్ డిసెంబర్ 10:
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గత ప్రభుత్వంలో జరిగిన తప్పులపై రైతుల సమస్యలను పరిష్కరించడానికిమొదటగా రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించారు.రెండవసారి ఏ గ్రామంలో అయినా భూ సంబంధ సమస్యలపై సమస్యలు ఉంటే పరిష్కరించుకోవడానికి ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించారు. కానీ బండి ఆత్మకూరు మండలంలో ప్రస్తుతం జరుగుతున్న గ్రామ సభలకు స్పందన కరువైంది. దీన్నిబట్టి చూస్తే రెవిన్యూ శాఖపై ప్రజలకు నమ్మకం లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. గత రెండు రోజుల నుంచి జరిగిన గ్రామసభల్లో బండి ఆత్మకూరు మేజర్ పంచాయతీ లో కేవలం ఆరు దరఖాస్తులు, ఈర్ల పాడు గ్రామంలో జరిగిన గ్రామసభలో 8 దరఖాస్తులు మాత్రమే రావడం ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఈ రెవెన్యూ సదస్సులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అధికారులు




అందరూ ఉండి ప్రజలనుండి వినతులు స్వీకరించాలి. కానీ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంతో నామమాత్రంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ మధ్యాహ్నం వెళ్ళిపోతున్నారు. ప్రతి గ్రామంలో ప్రతిరోజు రెవెన్యూ సదస్సులో ఉన్నట్లు గ్రామంలో దండోరా కానీ, ప్రజలకు తెలియజేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలకు గ్రామంలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు సమాచారం రెవెన్యూ అధికారులు తెలపడం లేదు. దీన్నిబట్టి చూస్తే రెవెన్యూ అధికారులు కేవలం నామమాత్రంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యం రైతులకు అండగా నిలవాలని కార్యక్రమాలు నిర్వహిస్తే బండి ఆత్మకూరు మండలంలో రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ నిర్లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. రీ సర్వే లో వచ్చిన సమస్యలే పరిష్కారం కాక, ఇప్పుడు ఇచ్చిన దరఖాస్తులకు పరిష్కారం దొరకదేమో అన్న నిరాశ అన్నదాతల్లో ఉందంటే బండి ఆత్మకూరు మండలంలో రెవిన్యూ శాఖ ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన అవుతుంది. సమయపాలన పాటించి రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సిన రెవిన్యూ అధికారులే సమయపాలన మధ్యాహ్నం సమయానికి ముగించుకొని వెళ్లిపోవడం వారి అంతులేని నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఈ విషయంపై నంద్యాల జిల్లా కలెక్టర్ దృష్టి సారించి రెవిన్యూ గ్రామసభలు సవ్యంగా జరిగేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.